

ఏకధాటి వర్షం.. అతలాకుతలం



శక్తినగర్‌లో భారీగా రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు, నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది





కాముని చెరువు నుంచి మైసమ్మ చెరువులోకి రసాయన వ్యర్థాలు చేరడంతో వెలువడుతున్న నురుగు, సఫ్దార్‌నగర్‌లో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

వర్ష బీభత్సానికి కూకట్‌పల్లి జోన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. రాకపోకలు సాగించేందుకు వీలులేకుండా ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలోకి నీరు రావడంతో రాత్రంతా జాగారం చేయాల్సిన దుస్థితి నెలకొందని ముంపు ప్రాంతవాసులు పేర్కొన్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి నెలకొంటున్నా ప్రజాప్రతినిధులు మాత్రం ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. జోన్ పరిధిలోని వివిధ కాలనీల్లో వరద ఏరులై పారింది. ప్రధాన రహదారులపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రోడ్లపై నీరు నిల్వకుండా పక్కా ప్రణాళికతో వరదనీటి కాలువ పనులు చేపట్టాలని కోరుతున్నారు. – కూకట్‌పల్లి జోన్ బృందం





మోతీనగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లలో ఇళ్లు నీట మునిగాయి. దీంతో ప్రజలు వస్తువులను మంచాలపై.. ఎత్తుగా ఉన్న ప్రాంతాల్లో.. తెలిసిన వారి ఇళ్లల్లో దాచుకున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాసాలకు తరలి వెళ్లారు. అధికారులు లోతట్టు ప్రాంతాల్లో ఎటువంటి చర్యలు చేపట్టకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వి. రామారావు నగర్ నుంచి అవంతినగర్ తోట వరకు నాలా విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో వర్షాలు వచ్చినప్పుడు ఈ సమస్య తలెత్తుతోంది. బీజేపీ, కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకులు ఈ ప్రాంతాల్లో పర్యటించి ఆహార పొట్లాలను అందజేశారు. అండగా ఉన్నామంటూ ధైర్యం చెప్పారు.

మోతీనగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ... ఎత్తుగా ఉన్న ప్రాంతాల్లో.. తెలిసిన వారి ఇళ్లల్లో ... బీజేపీ, కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకులు ఈ ప్రాం ...

ఉక్కిరిబిక్కిరి.. సిక్కుల కాలనీ



ఆల్విన్‌కాలనీ గురు గోవింద్‌సింగ్ కాలనీలో వర్షపు నీరు

[illegible] యాయని సిక్కులు వాపోయారు. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీలు ఇవ్వడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ కాలనీపై శ్రద్ధ వహించి ప్రజల ప్రాణాలకు రక్షణగా శాశ్వత పనులు చేపట్టి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.







రాజీవ్‌గాంధీ నగర్‌లో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్

రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలి

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన దీన్‌దయాల్‌నగర్, జింకలవాడల్లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెగక కురుస్తున్న వర్షాల కారణంగా వరదనీరు ప్రధాన రహదారులపై చేరి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతోందన్నారు. అధికారులు వెంటనే స్పందించి నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు చేపడుతున్నాం..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్, గురుగోవింద్ సింగ్ కాలనీల్లో ఇళ్లల్లోకి వరద నీరు ప్రవేశించింది. గురువారం విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆ ప్రాంతాల్లో పర్యటించి స్థానికులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. జీహెచ్ఎంసీ సిబ్బంది, ఎమర్జెన్సీ సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.



ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• బాలానగర్ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి



బాలానగర్: వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం కళ్యాణినగర్, వినాయక్‌నగర్‌లలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరితే వెంటనే జీహెచ్ఎంసీ అధికారులకు తెలపాలన్నారు. మరో రెండు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ప్రజలు ఉండొద్దన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం, శానిటేషన్ సిబ్బందితో పాటు కళ్యాణినగర్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాయకులు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్ ముదిరాజ్, ఎం.సుధాకర్, మొహమ్మద్ సోఫీ, తదితరులు పాల్గొన్నారు.

కూలిన పార్కు ప్రహరీని వెంటనే నిర్మించాలి..

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్ రోడ్డు నం.5లోని పార్కు ప్రహరీ కూలింది. విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కూలిన కాంపౌండ్ వాల్‌ను సాధ్యమైనంత త్వరగా నిర్మించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా శక్తినగర్‌లో రోడ్డుపై నీరు భారీగా నిలిచిపోయింది. మున్సిపల్ సిబ్బంది నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్, ఎలక్ట్రికల్ లైన్‌మెన్ సప్పిడి సురేష్, అశుతోష్, రెసిడెన్సీవాసులు వెంకట్‌కుమార్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయనగర్ రోడ్డు నం.5లో కూలిన పార్కు ప్రహరీ

క్లుప్తంగా

ఐటీసీకి బ్రాండ్ అంబాసిడర్‌గా రష్మిక

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ కాస్మెటిక్స్ ఉత్పత్తుల బ్రాండ్ ఐటీసీ ఫియామా తమ ప్యాచౌలి జెల్ బార్ కోసం బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ రష్మిక మందనను నియమించుకుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. సంప్రదాయ, ఆధునికతల సమ్మేళనం లాంటి తమ బ్రాండ్‌కు విభిన్న భాషల నటి హ్యాపీ గో లక్కీ తరహా మనస్తత్వం ఉన్న రష్మిక చక్కగా సరిపోతారని పేర్కొన్నారు. ఆమె ఎంపిక వినియోగదారులకు తమను మరింత చేరువ చేస్తుందన్నారు.

నేటి నుంచి మహాలక్ష్మి యాగం

మోతీనగర్: లోక కళ్యాణార్థం 12 సంవత్సరాల నుంచి మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో నవచండీ మహా రుద్రయాగ సహిత మహాలక్ష్మి యాగాన్ని నిర్వహించనున్నట్లు అంజిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విష్ణుభట్ల లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ యాగం ఆగస్టు 7వ తేదీ వరకు కొనసాగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహం అద్భుతం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ సచివాలయం ఎదుట డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అద్భుతమని భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. గురువారం యూపీ నుంచి నగరానికి వచ్చిన ఆయన ఎమ్మెల్సీ కవితతో కలిసి అంబేడ్కర్ విగ్రహం, అమరుల స్థూపం తదితర ప్రదేశాలను సందర్శించారు. పార్లమెంట్ ఎదుట కూడా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

జాతీయ విద్యావిధానంతో నైపుణ్యం పెంపుదల

ఎన్‌వీఎస్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ

గచ్చిబౌలి: జాతీయ విద్యా విధానంతో విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెరిగాయని నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణ అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని నవోదయ విద్యా సమితిలో 'జాతీయ విద్యా విధానం-2020' ప్రగతిపై నవోదయ సమితి, కేంద్రీయ విద్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గోపాలకృష్ణ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)-2020 దిక్సూచిగా మారిందన్నారు. సాంకేతిక వినియోగంతో కళ, బొమ్మ, క్రీడల ఆధారిత బోధన, అనుభవ పూర్వకమైన అభ్యాసంతో విద్యార్థులలో నైపుణ్యాలు పెరుగుతున్నాయన్నారు. బెంగళూర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 240 మంది విద్యార్థులకు గానూ 225 మంది ఐఐటీకి వెళ్లారని తెలిపారు. ఎన్ఈపీని అమలు చేసేందుకు ఉపాధ్యాయులకు నిరంతరం శిక్షణ ఇస్తున్నామని, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమన్నారు. జెఎన్‌వీ అసిస్టెంట్ కమిషనర్ అభిజిత్ బెహరా మాట్లాడుతూ టీచింగ్, లెర్నింగ్‌లో అనేక మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్, కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జెఎన్‌వీ డీసీ జగదీశ్వరాచారీ, అసిస్టెంట్ కమిషనర్ శాంతి, గచ్చిబౌలి కేవీఎస్ ప్రిన్సిపాల్ జితేంద్ర కుమార్, నవోదయ రంగారెడ్డి ప్రిన్సిపాల్ విజయ భాస్కర్, కేవీ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రిన్సిపాల్ మిత్రవింద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాలకృష్ణ

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని బస్ బాడీ వద్ద మయూరీనగర్ నుండి వచ్చే నాలా అవుట్‌లెట్‌ను, డోవా కాలనీలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట జీహెచ్ఎంసీ అధికారులు ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ శ్రీకాంతిని, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ శివప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మియాపూర్ దోవా కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే గాంధీ, అధికారులు

నేటి నుంచి జాబ్‌డ్రైవ్

సనత్‌నగర్: డాన్‌బాస్కో అనుబంధ సంస్థ దిశ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఐవాన్‌వాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, టీమ్‌లీడర్, అకౌంటెంట్, హెచ్ఆర్ రిక్రూటర్, బ్రాంచ్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ యా రోజుల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-3లోని లుంబినీ అమృత ఛాంబర్స్‌లో జాబ్‌మేళా కొనసాగుతుందన్నా రు. మరిన్ని వివరాలకు 94946 98219, 91548 98481 సంప్రదించాలన్నారు.

వరద ప్రాంతాల్లో పోలీసు అధికారుల పర్యటన

శేరిలింగంపల్లి: వర్షాల నేపథ్యంలో శేరిలింగంపల్లి ప్రాంతంలో సైబరాబాద్ పోలీసు అధికారుల బృందం గురువారం సాయంత్రం పర్యటించింది. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆధ్వర్యంలో మాదాపూర్ డీసీపీ సందీప్‌రావు, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐలు పాలవెల్లి, సంజయ్‌కుమార్, ఆర్‌సీపురం సీఐ పవన్‌కుమార్, చందానగర్ డీఐ వెంకటేశం, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి పర్యటించారు. లింగంపల్లిలోని గోపిచెరువు, నల్లగండ్ల చెరువులను పరిశీలించి చెరువుకట్టల పటిష్టత, నీటి నిల్వ, భారీ వర్షం పడితే నెలకొనే పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షం వచ్చే అవకాశం ఉంటే వెంటనే చెరువులోని కొంత నీటిని ఖాళీ చేయాలని సూచించారు. అనంతరం లింగంపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని సీపీ పరిశీలించారు. ప్రత్యామ్నాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లగండ్లలో సెల్లార్ల తవ్వకాలతో అపార్ట్‌మెంట్ల ప్రహరీగోడలు కూలిన ప్రాంతాన్ని, డాక్టర్స్ కాలనీలో సఖి నిర్మాణ సంస్థ సెల్లార్ ప్రాంతాన్ని పక్కనే ఉన్న ఆభరణ అపార్ట్‌మెంట్‌ను,అందులోని వారు కొందరు ఇళ్ళను ఖాళీ చేసిన విషయాన్ని తెలుసుకున్నారు. ట్రాఫిక్ జామ్ కాకుండా, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా, జీహెచ్ఎంసీ అధికారులు, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సీపీ అధికారులకు ఆదేశించారు.

అబ్దుల్ కలాం జీవన ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకం



డా. అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, నాయకులు

ఆల్విన్‌కాలనీ: శాస్త్రవేత్త, రాష్ట్రపతిగా విద్యార్థులకు మార్గ నిర్దేశకులుగా, రచయితగా అసమాన ప్రతిభా పాటవాలు చూపిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని యువ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్ అన్నారు. గురువారం అబ్దుల్ కలాం వర్ధంతిని ఎల్లమ్మబండలోని గుడ్‌విల్ హోటల్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు సాగిన ఆయన జీవన ప్రస్థానం యువతరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏ కరీం, షౌకత్ ఆలీ మున్నా, ఎంఏ సమ్మద్, ఖాజామియా, జగదీష్, ఎండీ సలీమ్, షేక్‌గౌస్, షేక్ ఖాజా, గౌస్, ఎండీ గౌస్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలి

మోతీనగర్: వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ సహకారాలను అందించలేని జీహెచ్ఎంసీ తీరుకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి జీహెచ్ఎంసీ కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు అసెంబ్లీ వద్ద అమరవీరుల స్థూపం నుంచి జీహెచ్ఎంసీ కార్యాలయం వరకు ర్యాలీగా బయల్దేరనున్నారు. జీహెచ్ఎంసీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని సీనియర్ నాయకుడు రాఘవేందర్ ఓ ప్రకటనలో తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తిరుమలలోని శ్రీవారిని బుధవారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

